## 366 క్రీస్తు మనల నెన్నఁడు విడువఁడు

రా - నాట (చాయ : ధరణిలోని ధనము) తా-ఏక

ఏల చింత యేల వంత - యిచట నీకు క్రైస్తవా = పాలకుండు యేసు నీదు - వంత లెల్ల నెరుఁగుఁగా ॥యేల॥

1. తొల్లి నీ వొనర్చినట్టి - దోష మెంతో జూడుమా = కల్లగాదు యేసు క్రీస్తు - చెల్ల చెదరఁ జేసెఁగా ॥యేల॥
2. నీకు కాలు జారినపుడు - నిన్ను లేవనెత్తెఁగా = నీ కలుషముఁ గడిగి వైచి - నిన్ను విమలుఁ జేసెఁగా ॥యేల॥
3. నీకుఁ గల్గు వ్యాధు లన్నా -నెవరు మీరఁ దీర్చెఁగా = ప్రాకటముగ నీకు సకల -పదవు లిచ్చి ప్రోచెఁగా ॥యేల॥
4. యేసు నిన్ను బాగు జేయ - నిచట శ్రమలు బెట్టుగా = వాసిగాను శ్రమలయందు - యేసు పజ్జఁజేరుమా ॥యేల॥
5. నిన్ను తల్లడిల్లఁజేయు - నీ విరోధు లందరిన్ = మున్ను తండ్రి పగిదిఁ దరిమి - పన్నుగాను బ్రోచెఁగా ॥యేల॥
6. సందియంబు లేల నీకు - స్వర్గ నాథుఁ డుండఁగా = అందమైన యీవులిచ్చి - యతఁడు నిన్నుఁ బ్రోవగా ॥యేల॥

- మేడికాయల సాధువు

## 367 క్రీస్తును వెంబడించుట

దేవా! వెంబడించితి నీ నామమున్ - జీవితేశ్వర నా జీవితాశ నీవే = రావె నా భాగ్యమా యేసువా ॥దేవా॥

1. యేసూ! నీదు ప్రేమను నే వింటిని - భాసురంబగు నీ సిలువ నే గంటిని = యేసువాడను నే నంటిని ॥దేవా॥
2. ప్రభో! ప్రారంభించితి ప్రయాణమున్-పరలోక యెరూషలేము పురికిన్ = పావనా జూపుము మార్గము ॥దేవా॥



3. నాథా! ఈదలేను ఈ ప్రవాహమున్ - నీదరిన్ గాన నీ కెరటాలధాటిచే = నావికా రమ్ము నన్ బ్రోవుము ॥దేవా॥
4. స్వామీ! నీదు ప్రేమకు నే సాక్షిని - సంఘమందున నా పొరుగువారికి నీ = సత్య సువార్త నే జాటుదున్ ॥దేవా॥
5. రాజా! నీదు రాజ్యములో జేరితి - రమ్యమౌ రాజ్యమందున నన్ వాడుము = రక్షణానందము గూర్చుము ॥దేవా॥

- ఎ.బి.మాసిలామణి

## 368 క్రైస్తవుని విజయము

రా - ఆనందభైరవి (చాయ : రాజులకు రాజైన) తా-ఖండజాతి ఛాప్

భయమేల క్రైస్తవుండా - నీవిక నపజయమున బ్రతుకనేల = జయ శూరుడగు ప్రభువు - యిలనీకు జయము నిచ్చుచ నుండగ ॥భయమేల॥

1. భూతపీడితుల నెల్ల - విడిపించుదాత - మన రక్షకుండు = సాతాను వల నుండియు - విడిపించిప నీతితో మనుపలేడా ॥భయమేల॥
2. మరణ పాశములనుండి - లాజరును - కరుణతో లేపలేదా = ధరణిమిమ్ముల నూతన - బలముతో - గుఱికి నడిపించలేడా ॥భయమేల॥
3. ద్రాక్షరసముగ నీళ్లను - మార్చిన - మహిమగల రక్షకుండు = అక్షయ సంతసంబు - నిలమీకు దీక్షతో నివ్వలేడా ॥భయమేల॥
4. ఐదు చిన్న రొట్టెలు - మరి రెండు - చిన్న చేపలతోడును = ఐదువేల మందిని - బలపర్చినట్టి రక్షకుడుండగ ॥భయమేల॥
5. విజయకరముగ బ్రతుకను - ప్రభువుండు - నిజవాగ్దత్తము లివ్వ నీ - వృజినము గెలువంగను - ముదముతో నిజముగ నెరవేర్చడా ॥భయమేల॥

- జి.జాన్ తాతయ్య